సాక్షి జగిత్యాల

శుక్రవారం। 24। నవంబర్। 2023

I



నృసింహుని సేవలో..

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని గురువారం పెద్దపెల్లి జిల్లా ఎన్నికల పరిశీలకులు, సీనియర్ ఐఏఎస్ శ్రీధర్ దర్శించుకున్నారు.



పదో రోజుకు గంగాహారతి

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గంగాహారతి గురువారం పదో రోజుకు చేరింది.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.0/23.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం స్వల్పంగా ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పౌరులందరూ భాగస్వాములు కావాలి



యాస్మిన్ బాషా, కలెక్టర్

జగిత్యాల: శాసనసభ ఎన్నికలు సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పౌరులందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ యాస్మిన్‌బాషా అన్నారు. ఎన్నికల్లో మద్యం, డబ్బు, ఇతర వస్తువులు పంపిణీ చేస్తే తెలియజేసే బాధ్యత పౌరులపై ఉందన్నారు. తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని పేర్కొన్నారు. పౌరులు ఐటీ శాఖ అధికారి 89859 70941 నంబరు, సీ విజిల్ యాప్ ద్వారా, జిల్లా కంట్రోల్ నంబరు 1800 425 7620, 1950 నంబరుకు డయల్ చేసి సమాచారం అందించాలని కోరారు.

పెళ్లి సందడి.. ఎన్నికల హడావుడి

జగిత్యాల: కార్తీకమాసం ప్రారంభం కావడంతో ఈనెల 23, 24, 27, 28, 29తో పాటు, డిసెంబర్ 3, 4, 7, 6, 9, 15 తేదీల్లో వివాహ ముహూర్తాలు అధికంగా ఉన్నాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులు కల్యాణవేదికల వైపు చూస్తున్నారు. అభ్యర్థులకు వివాహ ఆహ్వాన పత్రాలు అందడంతో తప్పకుండా హాజరయ్యేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈనెల 30న పోలింగ్ ఉండటంతో వివాహాలకు హాజరయ్యేలా ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు.


సామాజిక తనిఖీలో బయటపడిన అవినీతి




వివరాలు వెల్లడిస్తున్న తనిఖీ బృందం

కోరుట్లరూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో ఉపాధి హామీ పథకంలో రూ.40,182 అవినీతి జరిగినట్లు తనిఖీ బృందాలు నిర్ధారించాయి. మండలంలోని 15 గ్రామాల్లో 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు రూ. 2,46,50,664 విలువగల ఉపాధి పనులు చేపట్టారు. జరిగిన పనులకు సంబంధించి వారం రోజులుగా బృందాలు ఆయా గ్రామాల్లో తనిఖీలు, గ్రామసభలు నిర్వహించి నివేదికలు సిద్ధం చేశారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించి పలు గ్రామాల్లో అవినీతి జరిగినట్లు నివేదికలో పేర్కొనగా, రికవరీకి డీఆర్‌డీఏ ఏపీడీ బాలె శివాజీ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి చిన్నయ్య, అంబుడ్స్‌మెన్ కృష్ణారెడ్డి, ఎస్క్యూసీ రాజేంద్రప్రసాద్, ఎంపీడీవో శ్రీనివాస్, సోషల్ ఆడిట్ ఎస్ఆర్‌పీ కుమార్, ఏపీవో మమత తదితరులు పాల్గొన్నారు.

కోరుట్లలో బీజేపీకి షాక్



సునీత



అలేఖ్య

కోరుట్ల: అసెంబ్లీ ఎన్నికల వేళ కోరుట్ల పట్టణంలో బీజేపీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన ఇద్దరు కౌన్సిలర్లు పార్టీని వీడారు. 11వ వార్డు కౌన్సిలర్ దాసరి సునీత, 12వ వార్డు కౌన్సిలర్ మొలుమూరి అలేఖ్య బీజేపీకి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా వారు పత్రికాప్రకటన విడుదల చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్లుగా గెలిచినప్పటి నుంచి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ, వార్డుల అభివృద్ధి కోసం అధికార పార్టీని నిలదీస్తూ వస్తున్నామని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూడా బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మపురి అరవింద్ తాము ప్రజాప్రతినిధులమని కూడా చూడకుండా కనీస మర్యాద ఇవ్వడం లేదన్నారు. పార్టీ అభివృద్ధికి ఇప్పటివరకరు అహర్నిశలు కృషి చేస్తున్నప్పటికీ ఎన్నికలప్పుడైనా సరైన గుర్తింపు లభించడం లేదని పేర్కొన్నారు. ఇంతకాలం తమకు సహకరించిన పార్టీ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్ సులభతరం చేయాలి

జగిత్యాల: పోస్టల్ బ్యాలెట్ విధానం సులభతరం చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మచ్చ శంకర్, బైరం హరికిరణ్ అన్నారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇతర జిల్లాలు, నియోజకవర్గాలకు ఎలక్షన్ డ్యూటీలు కేటాయించినందుకు వారు ఓటు హక్కు వినియోగంలో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. ఎక్కడైతే డ్యూటీ అలాట్ కాబడిన కేంద్రంలో లేదా సొంత నియోజకవర్గం పోలింగ్ కంటే ముందు వినియోగించుకునేలా చూడాలని కోరారు.

ఆశీస్సులు ఎవరికో..

- సీనియర్ సిటిజన్ ఓట్లపై అభ్యర్థుల గురి
- వయోవృద్ధులకు ఇంటి నుంచే ఓటు
- జిల్లాలో 1.02 లక్షల వృద్ధుల ఓట్లు
- వారి ఓటింగ్ శాతం పెంచేలా చర్యలు





జిల్లాలో ఇంటి నుంచి ఓటు హక్కు	
వినియోగించుకునేవారు	1,141 మంది
బృందాలు	72

జగిత్యాల: శాసనసభ ఎన్నికల్లో సీనియర్ సిటిజన్స్ ఆశీస్సులు ఎవరికి దక్కనున్నాయో. ప్రస్తుత ఎన్నికల్లో వారి ఓట్లు సైతం కీలకంగా మారనున్నాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులు వయోవృద్ధుల ఓట్లను రాబట్టుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. వారు సీనియర్ సిటిజన్స్ కావడంతో ఆలోచించి ఓటు వేస్తారు. ఇంతకుముందు అనేకసార్లు ఓటు వేసినవారు కావడంతో వారిని ఎలా మచ్చిక చేసుకోవాలన్నది ప్రధాన పార్టీల అభ్యర్థులు తమదైన రీతిలో ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా సీనియర్ సిటిజన్స్‌కు చెందిన కొడుకులు, కోడళ్లు, మనుమలు వారు చెబితే ఓటు వేస్తారని అనుకుంటున్నప్పటికీ సీనియర్ సిటిజన్స్ మాత్రం ఆలోచనలు వేరేలా ఉంటాయి. దీనిని దృష్టిలో పెట్టుకున్న అభ్యర్థులు వారి వద్దకే వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. సీనియర్ సిటిజన్స్ ఓటింగ్ శాతం పెరగాలనే ఉద్దేశంతో వారు పోలింగ్ కేంద్రాలకు వచ్చేలా కలెక్టర్ యాస్మిన్‌బాషా ఆధ్వర్యంలో ప్రత్యేక బూత్ ఏర్పాటు చేయడంతో పాటు, ఇంటి నుంచే ఓటు వేసేలా సౌకర్యాలు కల్పించారు. ఇప్పటికే 80 ఏళ్ల సీనియర్ సిటిజన్స్‌కు ఓటు కోసం ఫారం 12–డీ ద్వారా ఓటు వేసేలా సౌకర్యం కల్పించారు. ఇంటింటికీ తిరుగుతూ వయోవృద్ధులకు ఓటు హక్కుపై అవగాహన సైతం కల్పించారు.

జిల్లాలో 1.02 లక్షల ఓటర్లు

జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో అన్ని కేటగిరీల్లో 1.02 లక్షల మంది సీనియర్ సిటిజన్లు ఉన్నారు. ప్రస్తుతం ప్రధాన పార్టీల అభ్యర్థులకు వీరి ఓట్లు కీలకంగా మారనున్నాయి. ముఖ్యంగా మున్సిపాలిటీల్లో వీరు అత్యధికంగా ఉన్నారు. రిటైర్డ్ అయిన వారు, ఇంటి వద్దే ఉండేవారు, పట్టణాల్లో ఉంటూ కాలం వెళ్లదీస్తున్నారు. వీరి ఓటరు జాబితాను తీసుకుని ఎక్కడెక్కడున్నారు, వీరిని ఎలా కలవడం అని అభ్యర్థులు అంచనా వేసుకుని వారి వద్దకు వెళ్లి కలుస్తూ ఓటు వేయాలని కోరుతున్నారు. వీరితో పాటు, దివ్యాంగులు సైతం అత్యధికంగా ఉండటంతో వారిని సైతం మచ్చిక చేసుకునేలా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో అన్ని కేటగిరీలకు చెందిన 2,27,944 మందికి పెన్షన్ అందుతుంది. వివిధ పార్టీలు సైతం పెన్షనర్లకు అత్యధిక పథకాలు ప్రకటించగా, వారి ఓటు ఎటువైపు వెళ్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇటీవల కొన్ని డిమాండ్లను లేవనెత్తుతూ జిల్లాలో ఆందోళన చేయడంతో పాటు, 12 వేల పోస్టుకార్డులను ముఖ్యమంత్రికి, ప్రధానమంత్రికి పోస్టు చేశారు. ప్రస్తుతం వారి ఓట్లు ఎలాగైనా రాబట్టాలని పార్టీల అభ్యర్థులు హామీలిస్తున్నారు.

ఓటింగ్ పెరిగే అవకాశం..

80 ఏళ్లు పైబడిన వారికి ఇంటి నుంచే ఓటు హక్కు అవకాశం కల్పించడంతో ఓటింగ్ శాతం పెరిగే అవకాశం ఉంది. గతంలో ఈ అవకాశం లేకపోవడంతో ఓటింగ్ శాతం తక్కువగా ఉండేది. ఎవరైనా సహాయకులతో పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వినియోగించుకునేవారు. సహాయకులు లేకపోవడంతో కొందరు ఓటు వేసేవారు కాదు. కానీ ఇప్పుడు ఎన్నికల కమిషన్ ఓటు వేయాలనుకునే వారి కోసం ప్రత్యేక బూత్‌లను ఏర్పాటు చేయగా, రాలేనివారు ఇంటి వద్దే ఓటు హక్కు సౌకర్యం కల్పించింది. దీంతో ఈసారి మున్సిపాలిటీలు, గ్రామాల్లో ఓటింగ్ శాతం పెరిగే అవకాశం ఉంది.

నేటి నుంచి ఇంటి వద్దే..

ఇంటి నుంచి ఓటు హక్కు వినియోగించుకునే ప్రక్రియ జిల్లాలో శుక్రవారం ప్రారంభం కానుంది. రెండు రోజులు ఈ బృందాలు తిరిగి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు స్వీకరించనున్నారు. అలాగే ఎవరైనా పోలింగ్ బూత్‌కు వెళ్లి వేస్తామనుకునే వారికి ఓటు వేసుకునే అవకాశం సైతం ఉంది.

స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్



సమావేశంలో పాల్గొన్న పోలీసు అధికారులు

- ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

జగిత్యాలక్రైం: సాధారణ ఎన్నికలు సజావుగా జరిగేలా పోలీస్ అధికారులు, సిబ్బందితో పటిష్ట చర్యలు చేపట్టినట్లు ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా విధులు నిర్వహించాలన్నారు. పోలింగ్ నిర్వహణ, విధులపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించేవారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. స్థానిక ప్రజలతో మమేకమవుతూ, ఆ ప్రాంతాలపై పూర్తి పట్టుసాధించి ఎలాంటి ఘటనలు జరగకుండా చూడాలని ఆదేశించారు. ప్రతి అధికారికి తమ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోలింగ్ లొకేషన్లు, కేంద్రాలు, రూట్ మొబైల్ గురించి పూర్తి అవగాహన ఉండాలన్నారు. ప్రతి ఠాణా పరిధిలో ఎస్సై, బ్లూ కోల్ట్ సిబ్బంది పోలింగ్‌కి రెండుమూడు రోజుల ముందు నుంచి 24 గంటల పాటు పెట్రోలింగ్ చేస్తూ ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే కఠినంగా వ్యవహరించాలని సూచించారు. క్రిటికల్ పోలింగ్‌కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలు, పటిష్ట బందోబస్తు, కేంద్ర బలగాలు వినియోగంపై తగు సూచనలు చేశారు. నగదు, మద్యం, ఉచిత పంపిణీలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ప్రతి స్టేషన్ పరిధిలో మొబైల్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడంతో పాటు సర్‌ప్రైజ్ వెహికల్ చెకింగ్, నాకబంది వంటి కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రతిక్షణం అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈసమావేశంలో అడిషనల్ ఎస్పీ (ఏఆర్) భీంరావ్, డీఎస్పీలు రవీంద్రకుమార్, వెంకటస్వామి, రవీంద్రరెడ్డి, డీపీ రంగారెడ్డి, ఎస్బీ, సీసీఎస్, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల పరిధిలో 383 మంది ఓటర్లు.. 20 బృందాలు

కోరుట్ల: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ స్టేషన్‌కు రాలేని 80 ఏళ్లు పైబడినవారు, వికలాంగులు శుక్రవారం ఇంటి వద్దే ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు కోరుట్ల అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో ఎస్.రాజేశ్వర్ గురువారం తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి ఓటు వేసే సదుపాయం కల్పిస్తున్నామన్నారు. వయోవృద్ధులు, వికలాంగులకు బీఎల్‌వోలు ఫారం 12లో సమాచారం అందించి ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన 5 రోజుల్లో ఆసక్తి కలిగినవారిని గుర్తించారన్నారు. నియోజకవర్గంలో ఇంటి నుంచి ఓటు వినియోగించుకునే అర్హత కల్గిన ఓటర్లు 383 మంది ఉన్నారని తెలిపారు. నియోజకవర్గంలో 20 రూట్లలో 20 మంది పోలింగ్ అధికారుల బృందం ఉంటుందని, ఒక్కో బృందంలో ఇద్దరు పోలింగ్ అధికారులు, ఒక పోలీస్ అధికారి, ఒక మైక్రో అబ్జర్వర్, ఒక వీడియో గ్రాఫర్ బూత్ లెవల్ అధికారితో కూడిన ఆరుగురు సిబ్బంది ఓటర్ ఇంటికి వెళ్లి సాయంత్ర 5 వరకు ఓటును పోస్టల్ బ్యాలెట్ ద్వారా రహస్య పద్ధతిలో స్వీకరించి రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అందజేస్తారని తెలిపారు. 24వ తేదీన పూర్తి కాకుంటే 25 వ తేదీన కూడా అర్హుల ఇంటికి వెళ్లి ఓటు స్వీకరిస్తారని ఆర్డీవో పేర్కొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్‌ను నమ్మితే గోసపడుతాం



రోడ్‌షోలో మాట్లాడుతున్న సంజయ్‌కుమార్



ఆటో డ్రైవర్లతో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

- కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్

మల్లాపూర్/ఇబ్రహీంపట్నం: ప్రజా సంక్షేమం, అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని కోరుట్ల నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం మల్లాపూర్ మండలం ఒబులాపూర్, తండా, సంగెం–శ్రీరాంపూర్, కొత్తదాంరాజుపల్లి, పాతదాంరాజుపల్లి, వాల్గొండ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. తెలంగాణను అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో నిలిపిన సీఎం కేసీఆర్, బీఆర్ఎస్‌ను ఓడించే శక్తి కాంగ్రెస్, బీజేపీకి లేదన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మోసపూరిత హామీలతో అధికారంలోకి రావాలని చూస్తున్నాయని, వారి మాటలు నమ్మితే మళ్లీ గోసపడుతామన్నారు. బీజేపీ అభ్యర్థి, ఎంపీ అరవింద్, కాంగ్రెస్ అభ్యర్థి నర్సింగరావు రూపాయి అభివృద్ధి చేయకుండా అహంకారపూరితంగా మాట్లాడుతున్నారని, ఓట్లతోనే వారికి తగిన బుద్ధిచెప్పాల్సిన సమయం వచ్చిందన్నారు. ప్రజలు ఆశీర్వదిస్తే మరింతగా అభివృద్ధి చేసి చూపిస్తానని, వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కాటిపెల్లి సరోజన, జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, దేవ మల్లయ్య, కొమ్ముల జీవన్‌రెడ్డి, మైదాసు శ్రీనివాస్, అలిశెట్టి రవి, పాలేపు దిలీప్, తోట శ్రీనివాస్, కమలాకర్, రవి, దండిక రాజన్న తదితరులు పాల్గొన్నారు. అలాగే డాక్టర్ సంజయ్‌ను గెలిపించాలని కోరుతూ ఇబ్రహీంపట్నం మండలం ఫకీర్‌కొండాపూర్‌లో గురువారం గుంటి దేవయ్య ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు.

ఎమ్మెల్యే కూతురు, కోడలు ప్రచారం

కోరుట్లరూరల్: మండలంలోని కల్లూర్, సర్పరాజ్‌పూర్ గ్రామాల్లో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు కూతురు డాక్టర్ సమత, కోడలు దీప్తి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దీప్తి బీడీలు చుట్టి ప్రచారం చేశారు. మాదాపూర్‌లో జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, వైస్ ఎంపీపీ చీటి స్వరూపారాణి ప్రచారం చేశారు. కేసీఆర్ భరోసా కరపత్రాలు పంపిణీ చేస్తూ ఓట్లు అభ్యర్థించారు. వనతడుపుల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో చేరిక

మెట్‌పల్లి(కోరుట్ల): మెట్‌పల్లి పట్టణానికి చెందిన ఆటో యూనియన్ సభ్యులు గురువారం ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యూనియన్ సభ్యుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానన్నారు. బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలని కోరారు.

బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

కోరుట్ల: కోరుట్ల పట్టణానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ పట్టణ మాజీ అధ్యక్షుడు కనుక గౌతమ్ 20 మంది అనుచరులతో బీఆర్ఎస్‌లో చేరగా వారికి ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు కండువాలు కప్పి ఆహ్వానించారు. పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే సంక్షేమ ఫలాలు

- జగిత్యాల అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్



మహిళలు అందజేసిన బతుకమ్మతో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

రాయికల్(జగిత్యాల): సీఎం కేసీఆర్‌తోనే సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం రాయికల్ మండలం అల్లీపూర్‌లో విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పొలాస సురేశ్, ఉపాధ్యక్షుడు రాముతో పాటు, సంఘం సభ్యులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్, బీజేపీల మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని పిలుపునిచ్చారు. తనకు మరోసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. ఎంపీటీసీ మోర విజయలక్ష్మీ, విండో చైర్మన్ రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

అవ్వా.. ఆశీర్వదించండి

జగిత్యాల: అవ్వా మరోసారి ఆశీర్వదించండి. ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తనదైన రీతిలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ప్రచారం చేపడుతున్నారు. గురువారం పట్టణంలోని వార్డులు, కాలనీలు తిరుగుతూ ప్రచారం చేపట్టారు.

అభివృద్ధికి ఆకర్శితులై..

బీఆర్ఎస్ చేపడుతున్న పథకాలకు ఆకర్శితులై పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం డీజిల్ ఆటో యూనియన్ సభ్యులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవలే సీఎం కేసీఆర్ ఆటోలకు ఫిట్‌నెస్ ఫీజును మాఫీ చేయిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, ప్రతి ఆటో డ్రైవర్‌కు కేసీఆర్ బీమా ద్వారా రూ.5 లక్షల పథకం అందజేస్తారని పేర్కొన్నారు.

అన్ని రంగాల్లో నంబర్‌వన్

సీఎం కేసీఆర్ పాలనలో అన్ని రంగాల్లో తెలంగాణ నంబర్‌వన్‌గా అభివృద్ధి చెందిందని చిత్రపరిశ్రమ కార్పొరేషన్ చైర్మన్ కూర్మాచలం అనిల్ అన్నారు. జగిత్యాలలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాట్లాడారు. జగిత్యాల జిల్లా అయిన తర్వాత ఎంతో అభివృద్ధి చెందిందని, సంజయ్‌కుమార్‌ను మళ్లీ గెలిపించాలన్నారు. సంజయ్‌కుమార్ గెలుపు కోసం అందరూ కృషి చేయాలన్నారు. బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ యూకే ప్రధాన కార్యదర్శి రత్నాకర్, సంతోష్‌కుమార్, సతీశ్‌రెడ్డి, సుభాష్ పాల్గొన్నారు.

జగిత్యాలకు జీవన్‌రెడ్డి ఏం చేశారు?

బీఆర్ఎస్ అభ్యర్థి సంజయ్‌కుమార్‌ను ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించాలని, 40 ఏళ్లు పాలించిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి జగిత్యాలకు ఏం చేశారని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంతెన మధు అన్నారు. బీఆర్ఎస్ కార్యాలయంలో మాట్లాడారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో జగిత్యాలలో అనేక అభివృద్ధి జరిగిందన్నారు. అలాగే బీజేపీ నాయకులు మాదిగలను ఓటు బ్యాంక్‌గానే చూస్తున్నారని, బీఆర్ఎస్‌కే తమ మద్దతని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి లింగంపల్లి లక్ష్మణ్ అన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, చంద్రయ్య పాల్గొన్నారు.

సబ్బండవర్గాలకు పెద్దదిక్కు

జగిత్యాలరూరల్: సబ్బండవర్గాలకు పెద్దదిక్కు సీఎం కేసీఆర్ అని జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. గురువారం జగిత్యాల రూరల్ మండలం తక్కళ్లపల్లి, అనంతారం, తుర్కకాశీనగర్, హైదర్‌పల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే సతీమణి రాధికతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అలాగే కేసీఆర్ మూడోసారి సీఎం కావాలని, సంజయ్‌కుమార్ ఎమ్మెల్యేగా గెలవాలని అనంతారం గ్రామానికి చెందిన ఏదుల శేఖర్ గురువారం తిరుపతికి పాదయాత్రగా వెళ్తుండగా జెడ్పీచైర్‌పర్సన్ అభినందించారు.



ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

సారంగాపూర్(జగిత్యాల): సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో గురువారం బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ రాంచందర్‌రావు, ఎంపీపీ జమున, తదితరులు పాల్గొన్నారు.

యాసంగి ఖరారు

- జిల్లాలో 3.94 లక్షల ఎకరాల్లో పంటల సాగు
- 3 లక్షల ఎకరాల్లో వరి..
- పెరగనున్న మొక్కజొన్న, నువ్వు పంటల విస్తీర్ణం



జగిత్యాలఅగ్రికల్చర్: యాసంగి సీజన్‌లోనూ జిల్లాలో వరి ప్రధాన పంటగా మారనుంది. ఆరుతడి పంటలైన మొక్కజొన్న, నువ్వులు, అవాల పంటకు జిల్లాలో అనువైన వాతావరణం ఉండటంతో వీటి సాగు విస్తీర్ణం సైతం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో జిల్లా వ్యవసాయ శాఖ యాసంగి సీజన్‌లో సాగు చేసే పంటల ప్రణాళికను విడుదల చేసింది.

పంటల సాగు ఇలా..

జిల్లాలో అన్నిరకాల పంటల సాగు విస్తీర్ణం దాదాపు 3.94 లక్షల ఎకరాల వరకు ఉంటుంది. ఈ ఏడాది వర్షాలు పుష్కలంగా కురవడంతో సాగు నీటికి ఇబ్బంది లేకుండాపోయింది. అలాగే ఓ వైపు ఎస్సారెస్పీ నీరు వస్తుండటం, చెరువులు, కుంటలు నిండి ఉండటం, వ్యవసాయ బావులు, బోరు బావుల్లో భూగర్భజలాలు 3–4 మీటర్ల లోతులోనే ఉండటంతో సాగు విస్తీర్ణం పెరగనుంది. ఈ మేరకు జిల్లాలో వరి 3 లక్షల ఎకరాల్లో, మొక్కజొన్న 55,434, నువ్వు పంట 23,500, ఆయిల్‌పాం 10వేలు, వేరుశనగ 301, పెసర 468, మినుము 505, అలసంద 488, ఆవాలు 3,100, చెరుకు 898 ఎకరాల్లో సాగు చేయనున్నారు. కోతులు, అడవి పందుల బెడదతో వేరుశనగ సాగు విస్తీర్ణం భారీగా పడిపోయింది. ఆవాల పంటను బై బ్యాక్ పద్ధతిలో కొనుగోలు చేస్తుండటంతో వేరుశనగ స్థానంలో అవాల పంట పెరిగింది. జిల్లాలోని ముత్యంపేట చెరుకు ఫ్యాక్టరీ మూతపడటంతో గతంలో 60–70 వేల ఎకరాలు సాగు చేస్తుండగా, ప్రస్తుతం 800 ఎకరాలకే పడిపోయింది.

ఎరువులు సిద్ధం

యాసంగికి అవసరమైన రసాయన ఎరువులను సైతం సిద్ధం చేస్తున్నారు. జిల్లాకు యూరియా 37,628 మె.ట, డీఏపీ 13,527, పొటాష్ 10,781, సూపర్ 5,231, కాంప్లెక్స్ ఎరువులు 47,680 మె.ట సిద్ధం చేస్తున్నారు. వరి నాటు సమయంలో డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు వేస్తుంటారు. రెండో, మూడో దఫా నుంచి యూరియా, పొటాష్ వేస్తుంటారు.

ప్రైవేట్ కంపెనీలపైనే ఆధారం


జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం పెరుగుతున్నా నాణ్యమైన విత్తనాలు మాత్రం సరిగ్గా దొరకడం లేదు. ప్రైవేట్ కంపెనీలపైనే ఆధారపడాల్సి వస్తుంది. కంపెనీలు చెప్పిన రేటుకు కొనుగోలు చేయాల్సి వస్తుంది. జిల్లాలో వరి విత్తనాలు 2,14,313 క్వింటాళ్లు, మొక్కజొన్న 3,852, మినుము 1,515, పెసర 117, ఆవాలు 46, నువ్వులు 470 క్వింటాళ్లు అవసరమవుతాయి. రైతులు స్వయంగా విత్తనాలు తయారుచేసుకోవడం పూర్తిగా మర్చిపోయారు. దీంతో 30 కిలోల వరి విత్తనాలను రూ.800 వరకు ధర పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తుంది. మొక్కజొన్న విత్తనం 4 కిలోల సంచికే రూ.1,200 వరకు వసూలు చేస్తున్నారు.

సబ్సిడీపై అందజేయాలి



యాసంగిలో వాతావరణం అనుకూలంగా ఉండటంతో అన్ని పంటల సాగు పెరుగుతుంది. రైతులకు ప్రతి పంట విత్తనాలను 50 శాతం సబ్సిడీపై అందజేయాలి. ప్రైవేట్ కంపెనీలు చెప్పిన ధరకు కొనుగోలు చేసేందుకు అధిక ఖర్చు అవుతుంది. – ఎదమల సత్యం, లక్ష్మీపూర్, జగిత్యాలరూరల్

నివేదిక తయారు చేశాం



జిల్లాలో సాగు చేయాల్సిన పంటల వివరాలతో నివేదిక తయారు చేశాం. రాష్ట్ర వ్యవసాయశాఖకు పంపించాం. రైతులు విత్తనాల కోసం ప్రైవేట్ కంపెనీలపై ఆధారపడే బదులు, బృందాలుగా ఉత్పత్తి చేసుకోవడమే కాకుండా ఇతరులకు అమ్మి ఆదాయం పొందవచ్చు. – పాక సురేశ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి

క్లుప్తంగా

ఎంసీహెచ్‌లో కోడ్ ఉల్లంఘనపై విచారణ

కరీంనగర్‌టౌన్: బతుకమ్మ సంబరాల్లో భాగంగా గత నెల 20న మాతాశిశు ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్) ఆవరణలో జరిగిన వేడుకల్లో ఎన్నికల కోడ్ ఉల్లంఘించడాన్ని ఎలక్షన్ కమిషన్ సీరియస్‌గా తీసుకుంది. ఆర్ఎంవో డాక్టర్ జ్యోతి, అదనపు ఆర్ఎంవో డాక్టర్ నవీన ఆధ్వర్యంలో నిర్వహించిన సంబరాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘించారన్న ఫిర్యాదు మేరకు ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణప్రసాద్ ఇద్దరు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేశారు. పిల్లల వైద్యుడు అజయ్‌కుమార్, రేడియాలజిస్టు రవీందర్ నేతృత్వంలో గురువారం ఎంసీహెచ్‌లో విచారణ చేపట్టారు. నివేదికను శుక్రవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌కు అందించనున్నారు. దాని ఆధారంగా చర్యలు చేపట్టే అవకాశం ఉంది.

రేపు వేములవాడకు రాహుల్‌గాంధీ రాక

వేములవాడ: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాహుల్‌గాంధీ ఈనెల 25న మధ్యాహ్నం 2 గంటలకు వేములవాడకు వస్తున్నట్లు కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ గురువారం తెలిపారు. శాత్రాజుపల్లి రోడ్డులోని సాయిరక్ష దాబా వద్ద ఏర్పాటు చేసిన బహిరంగసభలో మాట్లాడుతారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు, నియోజకవర్గప్రజలు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

వాహనాల తనిఖీ

కరీంనగర్ క్రైం: కరీంనగర్ త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు, స్పెషల్ యాక్షన్ టీంల ఆధ్వర్యంలో గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. సున్నితమైన ప్రాంతాల్లో పర్యటించి, ప్రజలకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో కరీంనగర్ టౌన్ ఏసీపీ నరేందర్, త్రీటౌన్ సీఐ శ్రీనివాస్, వన్ టౌన్ సీఐ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

భార్య మాట వినలేదని భర్త ఆత్మహత్య

- అనంతపల్లిలో విషాదం


బాబు(ఫైల్)

చందుర్తి(వేములవాడ): తన మాట భార్య వినలేదని మనస్థాపానికి గురై భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని అనంతపల్లిలో విషాదం నింపింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు. అనంతపల్లికి చెందిన బైరి బాబు(48)–లత దంపతులకు ఇద్దరు కూతుళ్లు. చిన్నకూతురు అదే గ్రామానికి చెందిన యువకుడిని ఏడాదిన్నర క్రితం ప్రేమవివాహం చేసుకుంది. దీంతో చిన్నకూతురిని మరిచిపోదామని ఆ దంపతులు నిశ్చయించుకున్నారు. అయితే చిన్నకూతురుకు గురువారం పాప పుట్టింది. ఈ విషయం తెలుసుకున్న బాబు భార్య లత ఆస్పత్రికి వెళ్లి చూసి వచ్చింది. ఈ విషయం తెలిసిన బాబు మనస్థాపానికి గురై ఇంట్లో దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుని భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రతీ ఓటు వజ్రాయుధమే

- అభివృద్ధికే ఓటు వేసేందుకు ప్రాధాన్యం
- సమర్థవంతమైన నాయకుడి వైపే మొగ్గు
- 'సాక్షి'తో వైద్యుల మనోగతం

పీపుల్స్ ఎజెండా



రాయికల్: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతీ ఓటు వజ్రాయుధమే. 18 ఏళ్లు నిండిన తొలి ఓటరు అయినా, వృద్ధుడు అయినా సమర్థవంతమైన నాయకున్ని కేవలం ఓటు హక్కు ద్వారానే ఎన్నుకునే అవకాశం ఉంది. ఈనెల 30న జరగనున్న శాసన సభ ఎన్నికల్లో ఎలాంటి నాయకున్ని ఎన్నుకోవాలనే అనే అంశాలపై జిల్లాకు చెందిన మహిళా వైద్యులు 'సాక్షి'తో తమ అభిప్రాయాలను ఇలా పంచుకున్నారు.

ఓటుహక్కు వినియోగించుకోవాలి



అర్హులైన వారు ఓటు హక్కు వినియోగించుకోవాలి. మంచి నాయకున్ని ఎన్నుకునే అవకాశం కేవలం ఓటుకు మాత్రమే ఉంది. ఎక్కడ ఉన్నా పోలింగ్ కేంద్రానికి వచ్చి తమ ఓటుహక్కును వినియోగించుకున్నప్పుడే ఓటుకు విలువ ఇచ్చిన వారవుతాం.

– భారతి, డీజీవో, భారతి హాస్పిటల్, జగిత్యాల

ప్రజాసేవ చేసేవారినే ఎన్నుకోవాలి



ఓటు ఎంతో విలువైంది. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఐదేళ్ల పాటు ప్రజలకు సేవచేసే మంచి నాయకుడిని ఎన్నుకోవాలి. అందుకు ఓటుహక్కును వజ్రాయుధంగా వినియోగించుకోవాలి. అన్నిరంగాల్లో అభివృద్ధి చేసే సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకోవాలి.

– చైతన్య సుధ, సివిల్ సర్జన్, కామఖ్య హాస్పిటల్

ప్రజాస్వామ్యంలో ఓటు ఆయుధం



దేశంలో ప్రజాస్వామ్యానికి ఓటు ఒక ఆయుధం లాంటిది. ఓటుహక్కు కలిగిన యువతీ, యువకులు ప్రజాప్రతినిధులను ఎన్నుకునే సమయంలో ఎలాంటి ప్రలోభాలకు లొంగొద్దు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు తమఓటు హక్కు వినియోగించుకోవాలి.

– రోజా, డీజీవో, కావేరి ఆస్పత్రి

ప్రలోభాలకు లొంగొద్దు



రాజకీయ పార్టీలు యువతీ యువకులు, ఓటర్లను ప్రలోభపెట్టి తమ అభ్యర్థులకే ఓటు వేసేలా ప్రయత్నిస్తారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా మంచి నాయకున్ని ఎన్నుకునేందుకు ఓటు ఆయుధంగా ఉపయోగపడుతుంది.

–మోర శ్రీలత, ఎండీ, శ్రీయాన్ హాస్పిటల్

ప్రతిఒక్కరూ ఓటు వేయాలి



మొదటిసారి ఓటుహక్కు పొందిన యువతీ, యువకులు ఓటు హక్కును వినియోగించుకోవాలి. యువత చేతుల్లోనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉంది. ఓటును దుర్వినియోగం చేసుకోవద్దు. నిజాయితీ గల అభ్యర్థికే ఓటు వేయాలి.

– సంజన, ఫిజియో థెరపిస్ట్, జగిత్యాల

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


రాకేశ్ (ఫైల్)

ధర్మపురి : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన దాసరి లచ్చయ్య– నర్సమ్మ దంపతులకు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు రాకేశ్ (20) ఉన్నాడు. గురువారం మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటలోని బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి వెళ్లాడు. సాయంత్రం ఇద్దరు స్నేహితులతో కలిసి పనినిమిత్తం బైక్‌పై వెళ్తుండగా లక్షెట్టిపేట వద్ద జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న కారును ఢీకొట్టారు. స్నేహితులద్దిరికీ స్వల్పగాయాలు కాగా రాకేశ్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. తల్లిదండ్రులు సంఘటనాస్థలానికి చేరుకొని కన్నీటి పర్యంతమయ్యారు. చేతికందిన కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. రాకేశ్ ఇంటర్ వరకు చదివి పట్టణంలోని ఓ కిరాణ దుకాణంలో గుమస్తాగా పని చేస్తున్నాడు.

నిర్భయంగా ఓటు వేయండి


మాట్లాడుతున్న సీఐ వేణుగోపాల్

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): ప్రజలు నిర్భయంగా తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని గోదావరిఖని టూటౌన్ సీఐ వేణుగోపాల్ కోరారు. గురువారం టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి రామగిరి మండలం సుందిళ్ల గ్రామంలో ఓటుహక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ, రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రలోభాలకు లోను కాకుండా స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. ఇందుకోసం పోలీసు శాఖ శాంతియుత వాతావరణం కల్పిస్తుందని తెలిపారు. ఈమేరకు భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో టూటౌన్ పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత


మద్యం బాటిళ్లు చూపుతున్న పోలీసులు

మానకొండూర్ రూరల్: మండలంలోని గంగిపల్లి శివారులో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ జె.ఇంద్రప్రసాద్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. పోలీసులు గురువారం గంగిపల్లి శివారులో వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో తాళ్లపల్లి శ్రీకాంత్ తన ద్విచక్ర వాహనంపై అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడ్డాడు. 95 మద్యం బాటిళ్లు, బైక్ సీజ్ చేశామని సీఐ పేర్కొన్నారు. అతనిపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్ఐ శ్రీకాంత్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్ పైనుంచి పడి తీవ్ర గాయాలు


గాయపడిన స్వరూప

వీణవంక(హుజూరాబాద్): జమ్మికుంటలో గురువారం నిర్వహించిన కాంగ్రెస్ సభకు వెళ్లి, తిరిగి వస్తుండగా వీణవంకకు చెందిన దానవేన స్వరూప ట్రాక్టర్ పైనుంచి పడటంతో తీవ్రంగా గాయపడింది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. స్వరూపతోపాటు కొందరు ట్రాక్టర్‌లో సభకు వెళ్లారు. తిరిగి వచ్చేటప్పుడు ఆమె ట్రాక్టర్ ఇంజిన్ వద్ద కూర్చుంది. వల్భాపూర్ సమీపంలోని కెనాల్ వద్దకు రాగానే ప్రమాదవశాత్తు రోడ్డుపై పడింది. ఈ ఘటనలో స్వరూప తలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలిని జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

పెళ్లయిన ఏడాదికే యువతి ఆత్మహత్య

- డబ్బు కోసం భర్త వేధింపులే కారణం

మానకొండూర్ రూరల్: ఓ యువతి వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుందని సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. వివరాల ప్రకారం పచ్చునూర్ గ్రామానికి చెందిన మానస (25)కు గట్టుదుద్దెనపల్లికి చెందిన పప్పు సంపత్‌తో ఏడాది క్రితం వివాహం జరిగింది. పెళ్లి సమయంలో ఒప్పుకున్న కట్నకానుకలు ముట్టజెప్పారు. కానీ, ఆరు నెలలకే అదనంగా డబ్బులు తీసుకురావాలంటూ భర్త ఆమెను వేధించడం మొదలుపెట్టాడు. దీపావళికి మానస తల్లిగారింటికి వచ్చింది. భర్త డబ్బులు కావాలని వేధిస్తున్నాడని తల్లిదండ్రులతో చెప్పింది. పండుగ మరుసటి రోజు సంపత్ పచ్చునూర్ వచ్చి, డబ్బులివ్వాలని గొడవపడి వెళ్లిపోయాడు. అప్పటినుంచి మానస పుట్టింట్లోనే ఉంటోంది. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన ఆమె బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి, బయటకు వెళ్లిపోయింది. గురువారం తల్లిదండ్రులు వెతకగా గ్రామంలోని ఓ వ్యవసాయ బావిలో మానస మృతదేహం కనిపించింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

పోస్టర్‌కు పేపర్ అతికించిన సిబ్బంది



రాయికల్: పట్టణంలోని ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి కేంద్రం వద్ద ప్రధాని మోదీ ఉన్న పోస్టర్‌ను గురువారం మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ సభ్యులు పేపర్ అతికించారు. ఎన్నికల కోడ్ పూర్తయ్యేంతవరకు పోస్టర్ల అతికించవద్దని ఆదేశించారు.

తండ్రి మరణాన్ని తట్టుకోలేక కొడుకు మృతి


లింగమూర్తి(ఫైల్)


వీర్నపల్లి(సిరిసిల్ల): తండ్రి మరణాన్ని తట్టుకోలేక మనోవేదనతో కొడుకు మృతిచెందిన సంఘటన మండలంలోని భూక్యతండాలో విషాదం నింపింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు. భూక్య శంకర్(48) తన కొడుకు ఆరోగ్యం బాగు చేయించేందుకు రూ.10 లక్షల వరకు అప్పులు చేసి.. వాటిని తీర్చే మార్గం కనిపించక గత వారం ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. తండ్రి మరణించినప్పటి నుంచి కొడుకు లింగమూర్తి(36) మానసిక వేదనకు గురవుతున్నాడు. తండ్రి లేని లోటు తాను భరించలేనని గురువారం ఒక్కసారిగా కుప్పకూలి ప్రాణాలు కోల్పోయాడు. వారం రోజుల వ్యవధిలో తండ్రీకొడుకుల మృతితో ఆ కుటుంబం రోడ్డున పడింది. మృతుడికి తల్లి రేణ, భార్య కవిత, కూతురు అశ్విత, కొడుకు వంశీ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు


గాయపడ్డ యువకుడు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలకేంద్రం శివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. రాచర్లగొల్లపల్లి నుంచి ఎల్లారెడ్డిపేటకు ద్విచక్ర వాహనంపై వస్తున్న అక్కపల్లికి చెందిన రాజును ఎల్లారెడ్డిపేట నుంచి గొల్లపల్లికి వెళ్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడ్డ రాజును స్థానికులు 108 వాహనంలో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

తంగళ్లపల్లిలో..


గాయపడిన రాజు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండల కేంద్రంలో గురువారం బైక్, మారుతి ఈకో వాహనం ఢీకొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న రాజు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రున్ని సిరిసిల్ల ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.

బెల్లం పానకం ధ్వంసం


బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

రాయికల్: మండలంలోని ఉప్పుమడుగు అటవీ ప్రాంతంలో అక్రమంగా నిల్వ ఉంచిన 900 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ అశోక్‌కుమార్ గురువారం తెలిపారు. గ్రామ శివారులో తనిఖీలు నిర్వహించగా కుంచెపు మహేశ్ ద్విచక్ర వాహనంపై 15 లీటర్ల నాటుసారాను తరలిస్తుండగా పట్టుకొని సీజ్ చేశామని, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. దాడుల్లో గట్టయ్య, మోహన్‌లాల్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

దొంగతనానికి వచ్చి.. పోలీసులు వచ్చారని

- త్రుటిలో తప్పించుకున్న ఆగంతకుడు


ఆగంతకుడి కోసం వెతుకుతున్న పోలీసులు

ధర్మపురి: చోరీకి యత్నించిన ఓ ఆగంతకుడు పోలీసుల అలికిడి విని త్రుటిలో తప్పించుకుపోయిన ఘటన గురువారం ధర్మపురిలో చోటు చేసుకుంది. పట్టణంలోని కోనేరు వెనుకభాగంలో బ్రాహ్మణ వీధిలో విశ్రాంత ఉపాధ్యాయుడు పెండాల రవికుమార్ రాజశ్రీ దంపతులు నివాసముంటున్నారు. గురువారం ఉదయం రవికుమార్ సమీపంలోని ఆలయానికి ఆలయానికి వెళ్లాడు. రాజశ్రీ కూరగాయల మార్కెట్‌కు వెళ్లింది. అదే సమయంలో ఓ వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి సామగ్రి సర్దుతున్నాడు. రాజశ్రీ ఇంటికి రాగా లోపల గడియపెట్టి ఉండడాన్ని గమనించింది. విషయాన్ని చుట్టుపక్కల వాళ్లకు తెలపడంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికి ఎస్సైలు దత్తాత్రి, రామకృష్ణ చేరుకున్నారు. పోలీసులు వచ్చిన విషయాన్ని గమనించిన ఆగంతకుడు వెనుకడోర్ నుంచి పరారాయ్యాడు. నిత్యం జన సంచారముండే బ్రాహ్మణ వీధిలో చోరీకి యత్నించడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి


జల (ఫైల్)

మేడిపల్లి : భీమారం మండలంలోని కమ్మరిపేటలో అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతిచెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జవ్వాజి జల (32) బుధవారం రాత్రి ఇంట్లో నిద్రకు ఉపక్రమించింది. తెల్లవారుజామున కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం చుట్టుపక్కల వెతికారు. ఇంటి సమీపంలోని పాడుబడ్డ బావి వద్ద చేతికర్ర తో పాటు పొగ వ్యాపించడాన్ని గమనించారు. మంటలు ఆర్పివేయడంతో కాలిన శరీర ఆనవాళ్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై శ్యామ్‌రాజ్, కోరుట్ల సీఐ ప్రవీణ్ కుమార్, మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్ రెడ్డి చేరుకొని, ఘటనా స్థలంలోనే పంచనామా నిర్వహించారు. అనుమానాస్పద మృతికింద పోలీసులు కేసు దర్యాప్తు పేర్కొన్నారు.

పోలింగ్ అధికారులకు ఈసీ సూచన

జగిత్యాలజోన్ : ఈనెల 30న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు, పోలింగ్ అధికారులకు కేంద్ర ఎన్నికల సంఘం పలు సూచనలు చేసింది. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో ఏ పార్టీకాని, అభ్యర్థి గాని ప్రచారం చేయరాదు. కేంద్రానికి వంద మీటర్ల పరిధిలో వివిధ పార్టీల బ్యానర్లు, జెండాలు, గోడల మీద రాతలు, పోస్టర్లు లేకుండా చూడాలి. పోలింగ్ బూత్‌లో దేశ నాయకుల చిత్రపటాలు ఉండొద్దు. అభ్యర్థుల జాబితా గుర్తులున్న పోస్టర్‌ను బూత్ ముందు ఓటర్లకు కనిపించేలా అతికించాలి. గదిలో సరైన వెలుతురు ఉండేలా చూడాలి. పోలింగ్ బూత్‌లోకి ఏజెంట్లు, సిబ్బంది, సెల్‌ఫోన్లు, వైర్‌లెస్, కార్డ్ లెస్ ఫోన్లు, వీడియో కెమెరాలు తీసుకెళ్లకూడదు. సంబంధం లేని వ్యక్తులను పోలింగ్‌స్టేషన్‌లోకి అనుమతించరు. అధికారులు ఓటు వేసేటప్పుడు ఓటింగ్ గదిలోకి వెళ్లరాదు. ప్రతి రెండు గంటలకోసారి అప్పటి వరకు పోలైన ఓట్ల వివరాలను జోనల్ ఆఫీసర్‌కు తెలపాలి. ఏజెంట్లు బూత్‌లో కూర్చుండే విషయంలోనూ తొలుత జాతీయ పార్టీ, తర్వాత రాష్ట్ర పార్టీ, అనంతరం స్వతంత్రులకు అవకాశం కల్పిస్తారు. పార్టీలకు సంబంధించిన దుస్తులు, టోపీలు, బ్యాడ్జీలు, కండువాలను తీసుకెళ్లవద్దు.

పకడ్బందీగా కౌంటింగ్ ఏర్పాట్లు


బద్దెనపల్లి గురుకులాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీలు

- కలెక్టర్ అనురాగ్ జయంతి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులకు సూచించారు. ఈమేరకు గురువారం తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్పీడ్ ఇంటర్నెట్‌తోపాటు, కమ్యూనికేషన్, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, సీసీ కెమెరాల ఏర్పాటు, ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్, భద్రత చర్యలు, వీడియోగ్రఫీ, ఫైర్‌సేఫ్టీ, సిబ్బందికి భోజన సౌకర్యాలపై అధికారులకు సూచనలు చేశారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ఎన్నికల నిబంధన మేరకు కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి, పీఆర్ ఈఈ సూర్యప్రకాశ్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి శ్రీనివాస్, డీపీఆర్వో దశరథం, సిరిసిల్ల, వేములవాడ తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎంల పనితీరు పరిశీలన

వేములవాడ: ఈవీఎంల పనితీరును కలెక్టర్ అనురాగ్ జయంతి పరిశీలించారు. ప్రభుత్వ హైస్కూల్‌కు చేరుకుని సిబ్బందికి పలు సూచనలు చేశారు. రిటర్నింగ్ అధికారి మధుసూదన్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు.

'అల్ఫోర్స్'లో అంతరిక్ష వీక్షణం


టెలిస్కోప్ ద్వారా ఖగోళాన్ని పరిశీలిస్తున్న విద్యార్థులు, నరేందర్‌రెడ్డి

రామడుగు(చొప్పదండి): మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ పాఠశాలలో విద్యార్థులు గురువారం అంతరిక్ష వీక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అత్యాధునిక టెలిస్కోప్ ద్వారా ఖగోళంపై అద్భుతాలను వీక్షించారు. ఈ సందర్భంగా చందమామ, ఇతర గ్రహాలు, చంద్రయాన్–3 అడుగుపెట్టిన ప్రదేశాన్ని పరిశీలించారు. విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు సైన్స్‌పై మరింత అవగాహన పెంచడం కోసం ప్రయోగాత్మకంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.